క్లుప్తంగా

పొలానికి వెళ్తూ వాగులో రైతు గల్లంతు



చిట్యాల: పొలానికి వెళ్తూ మండలంలోని వెంచరామి గ్రామ శివారు కుర్మపల్లికి చెందిన రైతు ఓద్యారపు మొగిలి మోరంచ వాగు దాటుతూ గల్లంతయ్యాడు. వెంచరామి శివారు కుర్మపల్లికి చెందిన మొగిలి, జంగా లక్ష్మయ్య, తోట లక్ష్మణ్, కెందా రాజయ్య కలిసి మోరంచ అవతల ఉన్న పొలాలను చూసేందుకు మంగళవారం ఉదయం వెళ్లారు. వాగు దాటుతుండగా.. మొగిలి ప్రమాదవశాత్తు నీట మునిగాడు. గమనించిన తోటి రైతులు అతడిని కాపాడేందుకు యత్నించగా.. మొగిలి అప్పటికే ప్రవాహంలో కొట్టుకుపోయాడు. విషయాన్ని సర్పంచ్ మల్లేశ్, ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్‌కు తెలిపారు. దీంతో హుటాహుటిన పోలీస్ సిబ్బంది వెళ్లి గ్రామస్తుల సహకారంతో మోరంచ వాగులో గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ అతడి ఆచూకీ తెలియరాలేదు. రాత్రి కావడంతో బుధవారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి

కాటారం: ప్రమాదవశాత్తు బావిలో పడి మండలంలోని జాదరావుపేటకు చెందిన తూండ్ల రాజయ్య(50) మృతి చెందాడు. రాజయ్య తన ఇంటి పక్కనే ఉన్న పెరట్లో కూరగాయలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం తోటకు నీళ్లు పెడదామని పెరట్లోకి వెళ్లాడు. ఈక్రమంలో బావి దగ్గరలో మోటారు పుట్‌బాల్‌కు నీళ్లు పోస్తున్న సమయంలో కాలు జారి ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. దీంతో రాజయ్యకు ఊపిరాడక నీటిలో మునిగి చనిపోయాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు కాటారం ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయుడికి జైలు

ములుగు: చెక్ బౌన్స్ కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఆర్నెళ్ల జైలు శిక్ష, రూ.15 లక్షలు జరిమానా విధిస్తూ ములుగు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ రామమోహన్‌రెడ్డి మంగళవారం తీర్పు వెల్లడించారు. న్యాయవాది కన్నోజు సునిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం నేరేడుపల్లికి చెందిన తాళ్లపల్లి సురేశ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలంలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో తన అవసరాల నిమిత్తం జిల్లా కేంద్రానికి చెందిన గండ్రకోట కుమార్ నుంచి రూ. 15 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. దీనికిగాను సురేశ్ ఇచ్చిన చెక్ 2012లో బౌన్స్ అయ్యింది. దీంతో కుమార్ కోర్టును ఆశ్రయించాడు. మంగళవారం న్యాయవాది సునిల్‌కుమార్ బాధితుడు కుమార్ తరఫున వాదనలు వినిపించగా.. ఏకీభవించిన జడ్జి రామమోహన్‌రెడ్డి జైలు శిక్షతో పాటు, జరిమానా విధించారు. ఇదిలా.. ఉండగా.. కుమార్ తనకు జరిగిన న్యాయంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

వెంకటాపురంలో విషాదం

వెంకటాపురం(కె): మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నేత పోలిన శ్రీనివాస్‌రావు మంగళవారం కారు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన స్వగ్రామం వెంకటాపురంలో విషాదం నెలకొంది. బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు, కూలీలు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

27న వాహనాల వేలం

ములుగు: వినియోగంలో లేని 64 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను ఈ నెల 27న ములుగు మండలం జాకారంలోని డిస్ట్రిక్ట్ పోలీస్ ట్రెనింగ్ కాలేజ్(డీటీసీ)లో వేలం నిర్వహించనున్నట్లు ఎస్పీ కార్యాలయ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలానికి వచ్చే వారు తమ వెంట ఆధార్ కార్డుతో పాటు వాహన భాగాలను విడిగా చేయడానికి కట్టర్‌తో ఉదయం 9గంటల వరకు డీటీసీలో హాజరుకావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

కుక్కల దాడిలో మేకలు మృతి

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని 5వ వార్డుకు చెందిన రైతు జాడి రాజుకు చెందిన మూడు మేకలపై మంగళవారం సాయంత్రం కుక్కలు దాడి చేశాయి. తీవ్ర గాయాలపాలైన మేకలు మృతి చెందాయి. తనకు రూ.20 వేలు నష్టం జరిగిందని, జీపీ అధికారులు, సర్పంచ్, పశుసంవర్ధకశాఖ అధికారులు తనకు పరిహారం అందించి ఆదుకోవాలని రాజు వేడుకుంటున్నాడు.

బాలల పరిరక్షణ చట్టాలపై అవగాహన సదస్సు

ములుగు: బాలల పరిరక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చైల్డ్‌లైన్ టీం సభ్యుడు రాంబాబు అన్నారు. ఈమేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని నవ భారతి మండల సమాఖ్య భవనంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు, లైంగిక దాడులు జరిగితే చైల్డ్‌లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098కు సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాల చట్టం 2006 ప్రకారం 18 ఏళ్లు నిండని వారికి వివాహం చేస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల్లో, కాలేజీలు, కమ్యూనిటీ లెవల్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎం రవి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి హరికృష్ణ, సంధ్య, సీసీలు, ఏఓ, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు ఆహారంలో భాగమవ్వాలి

- ఘనంగా పోషణ పక్వాడా
- ర్యాలీ, పోషకాహారంపై అవగాహన



భూపాలపల్లి రూరల్: ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు, మహిళలు

భూపాలపల్లి రూరల్: చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలని 22వ వార్డు కౌన్సిలర్ ముంజాల రవీందర్ అన్నారు. మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో హనుమాన్‌నగర్‌లో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వార్డులో మహిళలతో ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ మాట్లాడుతూ.. చిరుధాన్యాల్లో ఉండే పోషకాల విలువలతోపాటు, మహిళలకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల మండలంలో..

టేకుమట్ల: మండలంలోని కుందనపల్లి, అంకుషాపూర్ గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పొన్నం కోమల చంద్రయ్య, పండుగ శ్రీను ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీల ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని అందిస్తారని, కావున అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



టేకుమట్ల: అంకుషాపూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మి

పేదల అభివృద్ధే బీఆర్‌ఎస్ లక్ష్యం



చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ సాగర్, నాయకులు

చిట్యాల: పేద ప్రజల అభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యం అని జెడ్పీటీసీ గొర్రె సాగర్ అన్నారు. ఈసందర్భంగా మంగళవారం మండలంలోని నైన్‌పాక, చిట్యాల, జూకల్ గ్రామాల్లో ఇంటికి వెళ్లి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అరెపల్లి మల్లయ్య, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కామిడి రత్నాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు జంబుల తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతికుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఏరుకొండ గణపతి, మండల ప్రధాన కార్యదర్శి ఎరుకొండ రాజేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ మహేందర్, నాయకులు పోరెడ్డి సుదర్శన్‌రెడ్డి, పెరుమాండ్ల రవీందర్ గౌడ్, గుండా రవీందర్, పాండ్రాల స్వామి, దుప్పటి శ్రీనివాస్, ఐలయ్య, జూకల్ సర్పంచ్ పుట్టపాక మహేందర్, ఎంపీటీసీ కట్టికోళ్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల కుప్పగా ధనిక రాష్ట్రం

ములుగు రూరల్(గోవిందరావుపేట): ధనిక రాష్ట్రమైన తెలంగాణను సీఎం కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆరోపించారు. ఈమేరకు మంగళవారం గోవిందరావుపేట మండలం ప్రూట్‌ఫారంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారాంనాయక్ ఆధ్వర్యంలో చేపట్టిన గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమానికి సీతక్క హాజరై మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతుందన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి పైడాకుల అశోక్ తదితరులున్నారు.

పరీక్ష ప్యాడ్లు, పెన్నుల అందజేత



పరీక్షప్యాడ్లు అందజేస్తున్న నాయకులు

మహదేవపూర్: పదో తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో చదివి పరీక్షలకు సన్నద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ బెల్లంపల్లి సురేశ్‌మాదిగ కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, ఉర్దూ మీడియం, బాల బాలికల పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు ఇతర సామగ్రిని అందించారు. పరీక్షల్లో పదికి పది శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు పారితోషకం ఇస్తామని సర్పంచ్ శ్రీపతి బాబు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుడాల అరుణ, ఉపాధ్యాయులు అశోక్, శరత్, రాజునాయక్, పుణ్యవతి, స్వరూప పాఠశాల కమిటీ చైర్మన్ నల్లబూగ ధర్మయ్య, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షులు లింగాల రామయ్య, కాంగ్రెస్ నాయకులు చేకుర్తి శంకరయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు మంథని రవితేజ దళిత నాయకులు లింగాల సమ్మయ్య, ప్రభుకుమార్, శ్రీకాంత్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ప్రారంభ పనుల పరిశీలన



పనులు పర్యవేక్షిస్తున్న ఎస్సై చల్ల రాజు

టేకుమట్ల: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనం ఈనెల 25న ప్రారంభించనున్నారు. ఈనేపథ్యంలో మంగళవారం ఎస్సై చల్ల రాజు నూతన పోలీస్‌స్టేషన్ ఆవరణలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈసందర్భంగా పెయింటింగ్, ఫ్లోర్ లెవలింగ్, ప్లాంటేషన్, ట్రీగార్డుల ఏర్పాటును పర్యవేక్షించారు. అనంతరం సిబ్బందికి తగు సలహాలు సూచనలు అందించారు. ఆయన వెంట ఏఎస్సై ఇంతియాజుద్దీన్, సిబ్బంది సుమన్, మహేందర్, రాజు ఉన్నారు.

మొక్కల సంరక్షణను బాధ్యతగా భావించాలి



మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

కాటారం: హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కల సంరక్షణను బాధ్యతగా భావించి అవి ఏపుగా పెరిగేలా చూడాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి సూచించారు. మండలంలోని నస్తూర్‌పల్లి వద్ద జాతీయ రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలను మంగళవారం ఎంపీడీఓ పరిశీలించారు. ట్రీ గార్డులు సరిచేసి, గడ్డిని తొలగించాలని ఆదేశించారు. నేషనల్ హైవేపై మొక్కలు లేని చోట ఫారెస్ట్ నర్సరీ నుంచి మొక్కలు తెప్పించి నాటాలన్నారు. ప్రతీ శుక్రవారం గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంక్‌తో మొక్కలకు నీరు పట్టించాలని పేర్కొన్నారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ వెంకన్న, టెక్నికల్ అసిస్టెంట్ మనోజ్, పంచాయతీ కార్యదర్శి సురేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్ ఉన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్

భూపాలపల్లిరూరల్: ప్రతి ఒక్కరూ కంటి వెలుగు పరీక్షలు చేయించుకోవాలని 16 వవార్డు కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం భూపాలపల్లిలోని రాంనగర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కాలనీలో నాలుగు రోజులపాటు వైద్యులు కంటి పరీక్షలు చేయడంతోపాటు అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు ఇవ్వడం జరుగుతుందని కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు

పాఠశాలల్లో ముందస్తు ఉగాది వేడుకలు



టేకుమట్ల: వెలిశాల నవ చైతన్య ఉన్నత పాఠశాలలో ఉగాది వేడుకలు

మహదేవపూర్: మహదేవపూర్ మండల కేంద్రంలోని రైజింగ్ స్టార్ ప్రైవేట్ పాఠశాలలో ముందస్తు ఉగాది సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మంజులరెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాటారంలో..

కాటారం: మండల కేంద్రంలోని ఆదర్శ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తుగా ఉగాది సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆదర్శ స్కూల్ చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, కరస్పాండెంట్ కార్తీక్‌రావు, ప్రిన్సిపాల్ కృషిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టేకుమట్ల మండలంలో..

టేకుమట్ల: మండలంలోని అన్ని గ్రామాల ప్రభుత్వ పాఠశాలలతో పాటు, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కుండలో ఉగాది పచ్చడి చేసి తిన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు మియాపురం జగన్నాథం, కుర్రె ప్రవీణ్, దొమ్మటి శంకర్, రాం మధు, నారాయణ, చిరంజీవి, రాజేశ్వరి, సుమలత, నితీష, చైతన్య, నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

25న పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

కాటారం: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఈనెల 25న చైర్మన్ చల్ల నారాయణరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ ఎడ్ల సతీశ్ తెలిపారు. సంఘం అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలు, రుణాల రికవరీ, మంజూరు, తదితర అంశాలపై సమావేశంలో చర్చించి పాలకవర్గ అనుమతితో తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని సీఈఓ కోరారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సర్పంచ్ సిద్దంకి భాస్కర్

చిట్యాల: క్షయవ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామ సర్పంచ్ సిద్దంకి భాస్కర్ అన్నారు. ఈసందర్భంగా మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏఎన్‌ఎం లావణ్య ఆధ్వర్యంలో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఆశా వర్కర్‌లు పద్మ, విజయ, సుమలత, గ్రామస్తులు రాజేందర్, మోహన్, నందూ నాయక్, సమ్మయ్య, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సీఐని కలిసిన జెడ్పీటీసీ సాగర్, మండల నాయకులు

చిట్యాల: చిట్యాల నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన వేణుచందర్‌ను జెడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్‌ఎస్ మండల నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. సీఐని కలిసిన వారిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు ఆరెపల్లి మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతికుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ గణపతి, మండల కో–ఆప్షన్ సభ్యులు ఎండి రాజీమహ్మద్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు రత్నాకర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు ఏరుకొండ రాజేందర్, మన్నెం శ్రీనివాస్, మడికొండ రవీందర్‌రావు, నాయకులు కట్కూరి నరేందర్, పాండ్రాల వీరస్వామి, దుప్పటి శ్రీనివాస్, గుండా రవీందర్, తదితరులు ఉన్నారు.

మహా ధర్నాను విజయవంతం చేయాలి



సమావేశంలో మట్లాడుతున్న నాయకులు

కాటారం: ఈనెల 28న ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ భూపాలపల్లి జిల్లా కో–ఆర్డినేటర్ నోముల శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాజుల భిక్షపతి పిలుపునిచ్చారు. మండల పరిధి కాటారంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చి ఎనిమిది, తొమ్మిది ఏళ్లు గడుస్తున్నా.. ఏ,బీ,సీ,డీ వర్గీకరణ చేయకుండా మోసం చేశారని ఆరోపించారు. మండల ఎంఎస్పీ ఇన్‌చార్జ్ చంద్రగిరి అశోక్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు మంతెన చిరంజీవి, మంతెన శ్రీనివాస్, చీటిపెల్లి చిన్న తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న మహేందర్, తదితరులు

కాటారం: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మండలంలోని కొత్తపల్లికి చెందిన చిర్ర రాజేందర్‌కు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్, అతడి స్నేహితులు అండగా నిలిచారు. రాజేందర్‌కు రెండు కిడ్నీలు పాడైపోయాయి. తనకున్న అరెకరం భూమి అమ్ముకొని డయాలసిస్ చేయించుకున్నాడు. ఉన్నత వైద్యం కోసం డబ్బులు లేక ఇంటివద్దే మంచానికి పరిమితమయ్యాడు. రాజేందర్ అనారోగ్యం, ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఆయన గురువు బొట్ల రామస్వామి పూర్వ విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవాలని సూచించినట్లు ఇసునం మహేందర్ తెలిపారు. గురువు ఆదేశాల మేరకు మహేందర్‌తో పాటు శ్రీకాంత్, అర్చన, సంపత్, అర్జున్, స్వాతి తదితరులు విరాళాలు పోగు చేశారు. రూ.14 వేలను మంగళవారం మహేందర్ కొత్తపల్లి గ్రామానికి వెళ్లి బాధితుడికి అందించారు. రాజేందర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మహేందర్ వెంట బీఎస్పీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుగుల రాజన్న, కిరణ్ తదితరులు ఉన్నారు.

చిన్నారికి చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

భూపాలపల్లి రూరల్: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి కౌశిక్ తేజకు వరంగల్ జిల్లాకు చెందిన ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సహాయాన్ని అందించినట్లు సంస్థ వ్యవస్థాపకుడు జూపాక రత్న ప్రణయ్ తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన పాగె శోభ ముత్తయ్య దంపతులు భూపాలపల్లిలో నివాసం ఉంటున్నారు. వారి చిన్న కుమారుడు నాలుగేళ్ల వయసు కలిగిన కౌశిక్ తేజ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న స్వచ్ఛంద సంస్థ వారు చేయూత కార్యక్రమం ద్వారా మంగళవారం రూ.16,200ను బాలుడి తల్లి శోభకు అందించారు. ఈసందర్భంగా సంస్థ సభ్యులకు బాలుడి తల్లి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ పాలడుగుల సురేందర్, ఉపాధ్యక్షుడు గండి ఆనందం, ప్రధాన కార్యదర్శి అయిత ఉషాభాస్కర్, సహాయ కార్యదర్శి రోకుల లక్ష్మి, జగన్, ప్రదీప్ సందీప్, శ్రీకాంత్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.